# జనపదం
J A N A P A D H A M

హైదరాబాద్ | శనివారం 10 ఆగస్టు 2024 | తెలుగు దినపత్రిక




## గెలిచిన క్రీడాస్ఫూర్తి..

పారిస్ వేదికగా జరుగుతున్న ఒలింపిక్స్ క్రీడల్లో శుక్రవారం చోటు చేసుకున్న ఘటనే అందుకు నిదర్శనం. రన్నింగ్ రేస్ లో పాల్గొన్న స్పానిష్ క్రీడాకారుడు ఇవాన్ ప్రదర్శించిన క్రీడా స్ఫూర్తి, ఆటగాడిగా నైతిక విలువలకు కట్టుబడిన విధానం యావత్ క్రీడా లోకాన్నే కాదు.., మానవ మాత్రు లందరినీ ఆలోచించేలా చేసింది..

(వివరాలు స్పోర్ట్స్ పేజీలో...)

ఆట గెలిస్తే విజేతగా
నిలిచేవాడేమో
నీతిగా నడుచుకుని
విశ్వ విజేతయ్యాడు.
ఆడ మహా అయితే
బంగారు పతకం
వరించునేమో..
ఆ పనితో సమస్త
లోకపు కీర్తిని కైవసం
చేసుకున్నాడు.
గెలవడమంటే ఆటలో
కాదని..,
క్రీడాస్ఫూర్తి ఓడకుండా
చూడడమని
చాటారు.
మైదానంలో పరుగు
తీయడమే కాదు
క్రీడాకారుడిగా మనిష
నేవాడి పరువును
కాపాడారు.

# సుంకిశాల మీ పాపమే..?!



## ఎన్నాళ్లీ చిల్లర దాడి..

- ఘటనకు సీఎందే బాధ్యత..
- కూలిందని తెలిసినా దాచిపెట్టారు..
- వారం రోజుల కిందటే సర్కార్ కు ఘటన తెలుసు..
- అసెంబ్లీలో ప్రస్తావించకపోవడం కుట్ర కాదా..
- మంచైతే మాది.. చెడైతే మీదనే వ్యవహారం సరికాదు..
- మాజీ మంత్రి కేటీఆర్..
- సుంకిశాల ఘటనపై కాంగ్రెస్ సర్కార్ కు సూటి ప్రశ్నలు..

3

## మాకు సంబంధం లేదు..

- బీఆర్ఎస్ సర్కార్ హయాంలోనే కాంట్రాక్ట్, శంకుస్థాపన..
- కేసీఆర్ మానసపుత్రికో.., కేటీఆర్ మానస పుత్రికో అర్థం కావడం లేదు..
- ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**జనపదం, నల్గొండ:** సుంకిశాల ప్రాజెక్ట్ కాంట్రాక్ట్, శంకుస్థాపన బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని, దానితో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు సమీపంలోని సుంకిశాల ప్రాజెక్టు ను తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. **(తరువాయి 3వ పేజీలో)**



## గుట్టలుగా నోట్ల కట్టలు...

- నిజామాబాద్ మున్సిపల్ లో అవినీతి తిమింగలం..
- రెవెన్యూ అధికారి దాసరి నరేందర్ ఇంటిపై ఏసీబీ దాడులు..
- పట్టుబడిన రూ.2.93 కోట్ల నగదు..
- ఖాతాల్లో రూ.1.10 కోట్లు..
- అరకిలో బంగారం., 17 స్థిరాస్తుల గుర్తింపు..
- కేసు నమోదు.. కొనసాగుతున్న విచారణ

3



# కవిత బయటికి వస్తది..



- త్వరలో బెయిల్..
- సుప్రీం కోర్టులో అప్పీల్ చేశాం..
- సోమవారం కవిత పిటీషన్ పై విచారణ..
- సిసోడియా ఇష్యూ ఇప్పుడు మాట్లాడడం సరికాదు..
- మీడియా చిట్ చాట్ లో ఎమ్మెల్యే కేటీఆర్..

**జనపదం, హైదరాబాద్:** 'కవిత బెయిల్ కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించాం, గురువారమే అప్పీలు చేశాం.., సోమవారం విచారణకు రానుంది., త్వరలోనే కవితకు బెయిల్ వస్తుందని నమ్మకం ఉంది..'అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో పలు విషయాలపై చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ జైల్లో కవిత చాలా ఇబ్బందులు పడుతోందని, ఇప్పటికే 11 కిలోల బరువు తగ్గిందన్నారు. బీపీ వచ్చిందని, రోజు రెండు టాబ్లెట్స్ వేసుకోవాల్సి అవసరం ఏర్పడిందన్నారు.

**ఆలోచించి మాట్లాడాలి...**

సిసోడియాకు బెయిల్ వచ్చింది కాబట్టి మిగతా వాళ్లకు కూడా వస్తుందనే నమ్మకం వచ్చిందని కేటీఆర్ అన్నారు. అయినా **(తరువాయి 3వ పేజీలో)**



# అస్మదీయ అధ్యక్షుడు కావలెను..

## రెండు జాతీయ పార్టీల అన్వేషణ

- ఇరుపార్టీల్లో రెడ్డి సామాజిక వర్గం డామినేషన్..
- చెప్పు చేతల్లో ఉండే బీసీ నేతలెవరు..?
- సామాజిక వర్గాలుగా సమీకరణాలు..
- అనుయాయుల కోసం రాష్ట్రపార్టీ పెద్దల తాపత్రయం..
- తీవ్ర ప్రయత్నాల్లో ఆశావహులు..
- దసరాకైనా కొలిక్కి వచ్చేనా అనే అనుమానాలు..

2

రెండు జాతీయ పార్టీలు. అక్కడ అధికారంలో ఆ పార్టీ.., ఇక్కడ మరో పార్టీ. రెంటికి రెండు పార్టీ రాష్ట్ర అధ్యక్షుల కోసం తీవ్ర కసరత్తు. చట్ట సభల ఎన్నికలు ముగిశాయి. పాలన పనిలో నేతలు బిజీగా మారారు. ఇక మిగిలింది స్థానిక సమరం. ఇప్పటికైనా తమ బాధ్యతలను వేరే వారికి అప్పగించి కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి వారివారి కార్యకలాపాలను చేసుకునే వెసులుబాటు కోసం యత్నిస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా పదవుల అప్పగించే యత్నంలో ఎవరికి వారుగా సామాజిక సమీకరణాలపై కూడా కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. రెండు పార్టీల్లో చెప్పు చేతుల్లో ఉండే బీసీ నేత వెతుకుతున్నారు. - జనపదం, హైదరాబాద్ బ్యూరో

# అడవిని కాపాడేది ఆదివాసిలే..

- కల్మషం లేని మనుషులు వాళ్లు..
- గూడేలా అభివృద్ధితోనే దేశాభివృద్ధి..
- పేదరిక నిర్మూలనే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం..
- మంత్రి సీతక్క..
- ఘనంగా ఆదివాసీ దినోత్సవం..



**జనపదం, హైదరాబాద్ కల్చరల్:** ఆదివాసీలు ఉన్నచోటే అడవులు ఉన్నాయంటే అడవులను కాపాడింది ఆదివాసి బిడ్డలే అనేది తెలిసిపోతోందని, చెట్టును పుట్టను ప్రకృతిని ఆరాధించే ఆదిమ జాతి తో అడవులు ఎప్పుడు నాశనం కావని మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం ఆదివాసీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆదివాసీల ఆహారం ఎన్నో పోషకాలతో కూడుకున్నదని, అందుకే పట్టణాల్లోని కోటీశ్వరులు కూడా ఆ ఆహారాన్నే తీసుకుంటున్నారన్నారు. ఉత్సాహంగా ఆదివాసి దినోత్సవాన్ని జరుపుకుంటున్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. కొండ కోనల్లో వాగులు వంకల వద్ద నివసించే ఆదివాసులు హైదరాబాద్ వంటి **(తరువాయి 2వపేజీలో)**

# పాపం పసిగుడ్డు..

## పీక్కుతిన్న కుక్కలు..

### వరంగల్ ఎంజీఎంలో ఘటన..



- రెండు రోజుల పసికందును పీక్కుతిన్న శునకాలు
- నార్సింగ్ లో మరో ఘటన..
- బాలుడి మర్మాంగాన్ని కొరికేసిన గ్రామసింహం..
- రాష్ట్రవ్యాప్తంగా నిత్యం ఘటనలు..

2

కుక్కలు ఎగబడుతున్నాయి. పిక్కలు అందుకోవడం., పైన దాడి చేయడం కాదు.., ఏకంగా ప్రాణాలనే తీస్తున్నాయి. వరంగల్ నగర నడిబొడ్డున ఎంజీఎం దవాఖాన పరిసరాల్లో సుమారు రెండు రోజుల వయస్సున్న పసికందును శునకాలు పీక్కుని తిన్నాయి. నార్సింగ్ లో ఓ బాలుడి మర్మంగాన్ని కొరికేశాయి. నిత్యం రాష్ట్ర వ్యాప్తంగా కుక్కల స్వైరవిహారం పెరుగుతూనే ఉన్నా యంత్రాంగంలో మాత్రం చలనం ఉన్నట్టుగా మాత్రం కనిపించకపోవడమే విషాదం.

# అస్మదీయ అధ్యక్షుడు కావలెను..

- రెండు జాతీయ పార్టీల అన్వేషణ
- ఇరుపార్టీల్లో రెడ్డి సామాజిక వర్గం డామినేషన్..
- చెప్పు చేతల్లో ఉండే బీసీ నేతలెవరు..?
- సామాజిక వర్గాలుగా సమీకరణాలు..
- అనుయాయుల కోసం రాష్ట్రపార్టీ పెద్దల తాపత్రయం..
- తీవ్ర ప్రయత్నాల్లో ఆశావహులు
- దసరాకైనా కొలిక్కి వచ్చేనా అనే అనుమానాలు..



**జనపదం, హైదరాబాద్ బ్యూరో:** పార్లమెంట్ ఎన్నికలు ముగిసినప్పటి నుండి బీజేపి, కాంగ్రెస్ రెండు జాతీయ పార్టీలు తెలంగాణ శాఖ రాష్ట్ర అధ్యక్ష పదవులను భర్తీ చేసేందుకు తీవ్ర స్థాయిలో కసరత్తులు చేస్తున్నాయి. సామాజికవర్గాల సమీకరణాల నేపథ్యంలో రెండు పార్టీలకూ బీసీ నేతలే కావాలని జాతీయ స్థాయిలో పట్టుపడుతున్నా స్థానికంగా అసలు సిసలు అభ్యర్థులెవ్వరన్న చర్చ రెండు పార్టీల్లో విస్తృతంగా సాగుతున్నది. తెలంగాణ అంటేనే ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సామూహం. కాని రెండు జాతీయ పార్టీల్లో పై స్థాయిలో రెడ్డి సామాజికవర్గ నేతలే ఉన్నారు. బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో బీసీ లీడర్ల కోసం అన్వేషణ సాగిస్తున్నా ఒక దశలో ఎంపిక దాదాపుగా పూర్తయినా తమ అస్మదీయులు కావాలని ఆయా పార్టీల్లో చక్రం తిప్పుతున్నారు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీలో సీఎం రేవంత్ రెడ్డికి చేదోడు వాదోడుగా ఉండే నేత కావాలని ప్రయత్నిస్తున్నారు. అందుకు బీసీ, ఎస్టీ ల నుండి ఒకరిద్దరు తన అస్మదీయుల పేర్లు కూడా అదిష్టానానికిచ్చాని తెలుస్తోంది. ఇక బీజేపి నుండి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఎవరు అనుకూలంగా ఉంటే బాగుంటుదని చర్చ జరిగినా ఒక దశలో బీసీ అధ్యక్షుడు పేరు దాదాపు ఖరారైనా కొత్త వారికెలా ఇస్తరు...సంఘ్ అభ్యంతరాలను అదగిమించడం ఎలా చర్చ సాగుతోంది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డికి పంటికింద రాయిలా కాకుండా కంటికింది ఉండేవారినే రెండు జాతీయ పార్టీలు నియమించుకోవాలని చూస్తున్నాయి.

### కాంగ్రెస్ లో అస్మదీయుడికే అవకాశం

పదేండ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కొత్త పీసీసీ చీఫ్ కోసం వేట ఆరంభించింది. సీఎం రేవంత్ రెడ్డికి అనుకూలంగా ఉండే వారి కోసం వడబోత మొదలు పెట్టింది. పార్టీ అధికారంలోకి రాగానే కొత్త పీసీసీ చీఫ్ కోసం మాజీ ఎంపీ మధు యాష్కి గౌడ్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేశారు. బీసీ కోణంలో మధు యాష్కి పేరును అధిష్టానం ఖరారు చేసే క్రమంలో అదే గౌడ సామాజికవర్గం నుంచి మహేశ్ గౌడ్ పేరును సీఎం రేవంత్ తెరపైకి తీసుకొచ్చినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ మహేశ్ గౌడ్ కాకపోతే ఎస్టీ నుంచి సిట్టింగ్ ఎంపీ బలరాం నాయక్ కు ఇవ్వాలని సీఎం రేవంత్ ప్రతిపాదన పెట్టినట్టు తెలుస్తోంది. బీసీ అయినా ఎస్టీ అయినా కూడా సీఎం రేవంత్ కనుసన్నులో ఉండే పీసీసీ చీఫ్ కావాలని రేవంత్ పట్టుబడుతున్నారని ప్రచారం జరుగుతోంది. అధిష్టానం దగ్గర రేవంత్ పలుకుబడి దగ్గరగా చూస్తోన్న కాంగ్రెస్ సీనియర్లు కూడా పోటీ నుండి తప్పుకున్నారనే చెప్పాలి.

### బీసీ.. లెఫ్ట్...కానీ సిద్ధాంతం రైట్..

### బీజేపి తీరిది..

బీజేపీలో రాష్ట్ర కొత్త అధ్యక్షుడి నియామకం ఇప్పట్లో కొలిక్కి వచ్చేలా లేదు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తొందరగా రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను తప్పించాలని అధిష్టానానికి ఇప్పటికే విన్నవించారు. గ్రామ, మండల జిల్లా స్థాయిల్లో పార్టీ పటిష్టతతో పాటు స్థానిక ఎన్నికల్లో ప్రజా ప్రతినిధుల ప్రాతినిధ్యం పెంచుకోవడమనేది బీజేపీకి తక్షణ అవసరంగా మారింది. స్థానిక ఎన్నికల్లో జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అంతగా కేడర్, స్థానిక నాయకుల బలం లేని బీజేపీ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ ను ఎదుర్కొని గణనీయమైన సంఖ్యలో సర్పంచ్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను ఎలా గెలిపించుకోగలుగుతుందనే చర్చ కూడా పార్టీలో సాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో వీలైనంత తొందరగా రాష్ట్ర రాజకీయాలపై పట్టున్న నేతను కొత్త అధ్యక్షుడిని నియమిస్తే ఎన్నికల్లోగా సంస్థాగతంగా పార్టీ బలం పెం చుకునేందుకు అవకాశం ఉంటుందని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. ఈక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు గట్టిగా పోటీ పడుతున్నారు. ఈ పదవి కోసం ఎంపీలు డీకే ఆరుణ, , అర్వింద్ ధర్మపురి, ఈటల రాజేందర్, ఎం.రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, టి.రాజాసింగ్, ముఖ్యనేతలు ఎన్. రామచంద్రరావు, చింతల రామచంద్రా రెడ్డి, టీఆచారి, యెండల లక్ష్మీనారాయణ, ఎం.ధర్మారావు, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, డా. కాసం వెంకటేశ్వర్లు పోటీ పడుతున్నారు. బీజేఎల్పీ నేతగా రెడ్డి సామాజికవర్గానికి అవకాశం ఇచ్చినందున, రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ వర్గానికి చెందినవారినే ఆధిష్టానం నియమిస్తుంది. ఎంపీ ఈటల రాజేందర్ పేరును దాదాపు ఖరారు చేసినట్టే చేసి ఆపింది. రెండేళ్ల క్రితమే పార్టీలో చేరిన ఈటలకు అధ్యక్ష పదవి ఎలా ఇస్తారనే ప్రశ్నను కొందరు లేవనెత్తుతున్నారు. అందులో సైద్ధాంతికం, సంఘ్ అంశాలను కమలదళం పరిశీలిస్తే ఆయన కష్టమే అంటున్నారు. సైద్ధాంతిక అంశాలకు ప్రాధాన్యతనిస్తే మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావును అధ్యక్షుడిగా ఎంపిక చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.



## ముగిసిన పార్లమెంట్ సమావేశాలు..

- ఉభయ సభలు నిరవధిక వాయిదా
- తేనేటి విందులో మోడీ-రాహుల్ గాంధీ
- వైరల్ అవతున్న పిక్..

**జనపదం, ఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఇక ఈ సమావేశాల్లో పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. ముఖ్యంగా నీట్ లీకేజీ వ్యవహారం, రైల్వే భద్రత తదితర అంశాలు ఉభయ సభలను కుదిపేశాయి. పార్లమెంట్ సమావేశాలు గత నెల 22 నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలి రోజు 2023-24 ఆర్థికసర్వేను ఆర్థిక మంత్రి లోక్ సభలో ప్రవేశపెట్టారు. 'భౌగోళిక రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటూ భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు పటిష్టంగా ఉంది' అని ఈ ఆర్థిక సర్వేలో పేర్కొన్నారు. ఆ తర్వాత 23వ తేదీన 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఎన్డీయే కూటమి ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్‌పై ఉభయ సభల్లో వాడీవేడిగా చర్చ కొనసాగింది. చర్చ అనంతరం కేంద్ర బడ్జెట్‌కు సభ ఆమోదం తెలిపింది. ఇక ఈ సమావేశాలు ఆగస్టు 12వ తేదీ వరకూ కొనసాగుతాయని ప్రభుత్వం ముందే ప్రకటించినప్పటికీ ఉభయ సభలు ముందుగానే నిరవధికంగా వాయిదా పడ్డాయి.

### టీ పార్టీలో.. మోడీ, రాహుల్..

పార్లమెంట్‌లో ఆసక్తికర దృశ్యం కనువిందు చేసింది. ఎప్పుడూ ఉప్పు నిప్పుగా ఒకరిపై మరొకరు తీవ్ర విమర్శలు చేసుకునే ఇద్దరు నేతలు ఒక చోట కలిశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ తేనీటి విందులో పాల్గొన్నారు. పార్లమెంటు ఉభయసభలు శుక్రవారంతో నిరవధిక వాయిదా పడగా.. అనధికారికంగా నిర్వహించిన భేటీలో ఈ సంఘటన చోటు చేసుకుంది. మోదీ, రాహుల్ సహా పలువురు అధికార, ప్రతిపక్ష నేతలు ఈ టీ పార్టీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ, రాహుల్ ఒకరినొకరు నవ్వుతూ నమస్తే అని పలకరించుకోవడం గమనార్హం. పార్లమెంటులోనే కాకుండా.. బహిరంగ సభల్లో ఎప్పుడూ విమర్శలు గుప్పించుకునే ఈ అగ్రనేతలు ఇద్దరూ ఇలా ఒకచోట కూర్చుని ఉన్న ఫొటో బయటికి రావడంతో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

## ఏం ధరించాలో మీరే చెబితే ఎట్లా..?

- కాలేజీల్లో విద్యార్థులకు నచ్చిన వస్త్రాలు ధరించొచ్చు..
- హిజాబ్ ధరించడం వాళ్ల ఇష్టం..
- కాలేజీ సర్క్యులర్ సుప్రీం కోర్టుపై స్టే



**జనపదం, ఢిల్లీ:** కళాశాల క్యాంపస్‌లలో విద్యార్థులు హిజాబ్‌లు ధరించడాన్ని నిషేధించడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. కాలేజీ, స్కూళ్లలో విద్యార్థినులు ఏం ధరించాలో సదరు యాజమాన్యాలే నిర్ణయించటం ఏంటని మండిపడింది. అమ్మాయిలు ఏం ధరించాలనేది వారి వ్యక్తిగత నిర్ణయమని.. దేశంలో అనేక మతాల ప్రజలు నివసిస్తున్నారనే విషయం సదరు కాలేజీ యాజమాన్యానికి తెలియదా అని నిలదీసింది. ఇలా చేస్తే మహిళా సాధికారికత సంగతి ఏంటని ప్రశ్నించింది. కళాశాల క్యాంపస్‌లో హిజాబ్, బుర్కా, నిఖాబ్ ధరించకూడదంటూ చెంబూరు కళాశాల జారీ చేసిన సర్క్యులర్ పై సుప్రీంకోర్టు శుక్రవారం స్టే విధించింది. ముంబయిలోని ఎన్‌జీ ఆచార్య, డీకే మరాఠే కాలేజీకి చెందిన ముస్లిం విద్యార్థినులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. కళాశాల ఆదేశాలను సమర్థిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై పిటిషనర్లు సుప్రీంకోర్టు ఆశ్రయించారు. కళాశాల విధించిన షరతులపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, సంజయ్ కుమార్ ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది.

### మతాన్ని బయటపెట్టకూడదా..?

విద్యార్థుల మతం వెల్లడి కాకూడదనే నిబంధన విధించారంటూ కాలేజీ యాజమాన్యం వాదనలపై జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రశ్నలు లేవనెత్తారు. విద్యార్థుల పేర్లు మతాన్ని బహిర్గతం చేయడం లేదా? నెంబర్స్ ద్వారా వారిని గుర్తించమని అడుగుతారా? అంటూ జస్టిస్ సంజయ్ కుమార్ ప్రశ్నించారు. కాలేజీ తరపు సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ వాదనలు వినిపిస్తూ ఇది ప్రైవేట్ సంస్థ అని చెప్పగా.. కాలేజీ ఎప్పటి నుంచి పని చేస్తుందని జస్టిస్ సంజయ్ కుమార్ ప్రశ్నించారు. 2008 నుంచి కళాశాల ఉనికిలో ఉందని చెప్పగా.. ఇన్నాళ్లు మీరు ఎందుకు సూచనలు చేయలేదు..? మతం అకస్మాత్తుగా గుర్తించారా? ఏళ్ల తర్వాత ఇలాంటి సూచనలు చేయడం దురదృష్టకరమని.. తిలకం ధరించిన వారిని సైతం అనుమతించబోమని చెబుతారా? అంటూ జస్టిస్ ఖన్నా న్యాయవాదిని ప్రశ్నించారు. 441 మంది ముస్లిం విద్యార్థులు కళాశాలకు సంతోషంగా హాజరవుతున్నారని.. కొందరు మాత్రమే అభ్యంతరం వ్యక్తం చేశారని తెలిపారు. అయితే, నచ్చిన దుస్తులు ధరించేందుకు విద్యార్థులకు అవకాశం ఉండాలని న్యాయస్థానం తెలిపింది. ఈ విషయంలో స్పందన చెప్పాలని ముంబయి ఎడ్యుకేషన్ సొసైటీని సుప్రీంకోర్టు కోరింది. ఈ మేరకు కళాశాలకు నోటీసులు జారీ చేసింది. కేసు విచారణను నవంబర్ 18కి వాయిదా వేసింది. స్టే ఆర్డర్‌ను ఎవరూ దుర్వినియోగం చేయొద్దని బెంచ్ స్పష్టం చేసింది.

# పాపం పసిగుడ్డు..

- పీక్కుతిన్న కుక్కలు..
- వరంగల్ ఎంజీఎంలో ఘటన
- రెండు రోజుల పసికందును కొరుక్క తిన్న శునకాలు..
- నార్సింగ్ లో మరో ఘటన..
- బాలుడి మర్మాంగాన్ని కొరికేసిన గ్రామసింహం..
- రాష్ట్రవ్యాప్తంగా నిత్యం ఘటనలు..
- తగిన చర్యల్లో యంత్రాంగం విఫలం..



**జనపదం, హైదరాబాద్:** రాష్ట్రంలో కుక్కలు వణుకు పుట్టిస్తున్నాయి. రోజుకు పదుల సంఖ్యలో కుక్కల దాడిలో గాయపడుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా.. సమస్యకు మాత్రం పరిష్కారం లభించడం లేదు. శుక్రవారం రాష్ట్రంలోని వెలుగుచూసిన రెండు ఘటనలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో చిన్నపిల్లలపై వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. హైకోర్టు ఆదేశించిన కుక్కల నియంత్రణలో జీహెచ్‌ఎంసీ విఫలమవుతోంది. తాజాగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. నార్సింగి మున్సిపాలిటీలోని కొకపేట సబితానగర్ కాలనీలో 7ఏళ్ల దివ్యాంగ బాలుడిపై వీధికుక్క దాడి చేసింది. ఈ ఘటనలో బాలుడి పురుషాంగాన్ని వీధి కుక్క కొరికేసింది. బాలుడి అరుపులు విన్న స్థానికులు వీధికుక్కను కొట్టి తరిమేసి.. వెంటనే చికిత్స నిమిత్తం బాలుడిని ఆస్పత్రికి తరలించారు.

### ఎంజీఎంలో నవజాత శిశువు..

వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి వద్ద శుక్రవారం రాత్రి ఘోర ఘటన చోటు చేసుకున్నది. ఎంజీఎం వద్ద కుక్కలు నాలుగు రోజుల వయసున్న నవజాత శిశువును పీక్కుతిన్నాయి. ఇది గమనించిన సెక్యూరిటీ గార్డులతో పాటు అక్కడే ఉన్న రోగుల బంధువులు కుక్కలను చెదరగొట్టారు. ఎంజీఎం క్యాజువాలిటీ ఎదుట ఈ ఘటన చోటు చేసుకున్నది. కుక్కలు దాదాపు శిశువు సగ భాగాన్ని తినేశాయి. ఆ తర్వాత శిశువు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచారు. అయితే, శిశువు మగనా.. ఆడనే అనే విషయం తెలియరాలేదు. శిశువు ఆనవాళ్లు గుర్తించడం కష్టంగా మారింది. శిశువును కుక్కలు ఎక్కడి నుంచి తీసుకువచ్చాయా? ఎవరైనా శిశువు మృతదేహాన్ని పడేసి వెళ్లారా? అనేది తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శిశువును ఎవరు పడేసి వెళ్లారనే కోణంలో విచారణ జరుపుతున్నారు. ఆసుపత్రిలోని సీసీటీవీ ఫుటేజీని సైతం పరిశీలిస్తున్నారు.

# సిసోడియా విడుదల..

- 2023 ఫిబ్రవరి 26న అరెస్ట్ చేసిన సీబీఐ
- 17 నెలల అనంతరం బెయిల్..
- ప్రతీ సోమవారం దర్యాప్తు సంస్థ ఎదుట హాజరుకావాలి
- పరిమితి దాటిన తర్వాత జైల్లో ఉంచడం సరికాదు..
- తీర్పునిచ్చిన సుప్రీం కోర్టు..



**జనపదం, ఢిల్లీ:** ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టయిన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు, ఢిల్లీ మాజీ మంత్రి మనీష్ సిసోడియాకు భారీ ఊరట లభించింది. 17 నెలల అనంతరం సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లో రూ.10 లక్షల పూచీకత్తుపై బెయిల్ ఇచ్చింది. ఫిబ్రవరి 26, 2023న అరెస్టయిన మనీష్ సిసోడియా తీహారు జైల్లోనే ఉన్నారు. పలుసార్లు ఆయన వేసిన బెయిల్ పిటిషన్లను కోర్టులు తిరస్కరించాయి. చివరకు సుప్రీంకోర్టు తాజాగా ఉపశమనం కలిగించింది. అయితే, మాజీ మంత్రి తన పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని కోర్టు ఆదేశించింది. ప్రతి సోమవారం దర్యాప్తు సంస్థ ముందు హాజరుకావాలని సిసోడియాను సుప్రీం ఆదేశించింది. సీబీఐ, ఈడీ కేసులను విడివిడిగా సుప్రీం విచారించింది. అయితే విచారణలో జాప్యం కావడం వల్లే బెయిల్ మంజూరు చేస్తున్నట్టు స్పష్టం చేసిన న్యాయస్థానం.. సాక్షులను ప్రభావితం చేయరాదని పేర్కొంది.

### ఆప్ నేతల్లో ఆనందం..

కొద్ది రోజుల క్రితం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ మద్యం విధానం కేసులో బెయిల్ లభించింది. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు సైతం బెయిల్ మంజూరు కావడంతో ఆప్ నేతలు ఊపిరి పీల్చుకున్నారు. అవినీతి, మనీలాండరింగ్ కేసుల్లో సిసోడియాకు బెయిల్ సుప్రీం బెయిల్ ఇచ్చింది. ఏ నిందితుడిని కాలపరిమితి లేకుండా జైలులో ఉంచలేరని ధర్మాసనం పేర్కొంది. కేసు విచారణలో పురోగతి లేకపోతే... ఒక పరిమితి దాటిన తర్వాత జైలులో ఉంచలేరని పేర్కొంది. అలా కాదు అని... జైలులో ఉంచాలి అనుకుంటే ఆ వ్యక్తి హక్కులు హరించడమేనని సుప్రీం కోర్టు అభిప్రాయ పడింది. బెయిల్‌కి అప్లికేషన్ పెట్టుకోవడం, బెయిల్ పొందడం వారి హక్కు అని ధర్మాసనం పేర్కొంది.

### వ్యతిరేకించిన సీబీఐ, ఈడీలు..

బెయిల్‌ను సీబీఐ, ఈడీలు వ్యతిరేకించాయి. జైలు నుంచి బయటకు వస్తే ఆయన సాక్షులను ప్రభావితం చేస్తారని వాదించాయి. కానీ, న్యాయస్థానం మాత్రం వారి వాదనలను తోసిపుచ్చింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో 2023 ఫిబ్రవరి 26న సిసోడియాను సీబీఐ అరెస్ట్ చేయగా... మనీల్యాండరింగ్ ఆరోపణలతో అదే ఏడాది మార్చి 9న ఈడీ అదుపులోకి తీసుకుంది. అప్పటి నుంచి ఆయన తీహార్ జైల్లోనే ఉన్నారు. అయితే, విచారణ సమయంలో కేసు దర్యాప్తు ఎప్పటిలోగా పూర్తవుతుందని సీబీఐ, ఈడీలను న్యాయస్థానం ప్రశ్నించి ది. ఈ కేసుల్లో 493 మంది సాక్షులను విచారించారని, ఇంకా ఎన్నాళ్లు పడుతుందని నిలదీసింది. ట్రయల్ వేగంగా జరిగేందుకు సిసోడియా సహకరించాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది. మొత్తానికి ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది.

## గ్యాంగ్ స్టర్ దారుణ హత్య..

- కారుతో ఢీకొట్టి.. కాల్చి చంపిన గుర్తుతెలియని వ్యక్తులు
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**జనపదం, క్రైమ్:** హైదరాబాద్‌లో గ్యాంగ్‌స్టర్ హత్య కలకలం రేపింది. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్‌సీఐ రోడ్డులో ఈ ఘటన చోటు చేసుకుంది. మీర్ పేట్ లో నివాసం ఉంటున్న గ్యాంగ్ స్టర్ రియాజ్ బైక్‌పై వెళుతుండగా ప్రత్యర్థులు తుపాకులతో కాల్పులు జరిపారు. రియాజ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కారుతో వెంబడించి మరీ వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టి ఆపై కాల్పులు జరిపారు. దీంతో రియాజ్ అక్కడికక్కడే మరణించాడు. పాత కక్షల నేపథ్యంలోనే రియాజ్‌పై దాడి చేసి చంపి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాలాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఏఆర్‌సీఐ రోడ్డులో రియాజ్‌పై గుర్తు తెలియని దుండగులు మూడు రౌండ్ల కాల్పులు జరిపినట్టుగా పోలీసులు గుర్తించారు. సంఘటన స్థలం చేరుకున్న బాలాపూర్ పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని రాచకొండ సి పి సుధీర్ బాబు, మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, వెస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్ పరిశీలించారు. మృతుడు ఖాజా రియాజుద్దీన్ ఫ్రూట్ మర్చంట్ వ్యాపారం చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడిపై పలు కేసులు ఉన్నాయని సీపీ తెలిపారు. ప్రత్యర్థులు కారులో వచ్చి హత్యకు పాల్పడినట్టు తెలిపారు. ఘటనా స్థలంలో బుల్లెట్ షెల్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టెక్నికల్ టీమ్స్, ఎస్వోటీ టీమ్స్‌కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. బాలాపూర్ స్టేషన్‌తో పాటు పాతబస్తీలో కేసులు ఉన్నాయని, మీర్‌పేట్ పిఎస్ లిమిట్స్ పరిధిలో నివాసం ఉంటున్నట్టు తెలిపారు.

## అడవిని కాపాడేది ఆదివాసీలే..

(మొదటి పేజీ తరువాయి) నగరాల్లో తమ హక్కుల పై చర్చించే స్థాయికి ఎదగడం అభినందనీయం అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశించుకునేలా ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకుంటున్న తీరు సంతోషించదగ్గదన్నారు.

### అభివృద్ధికి నోచలే..

గిరిజనులు, ఆదివాసీలు పోరాటాలు, త్యాగాలు చేశారుగానీ ఆ జాతులు అభివృద్ధికి అంతగా నోచుకోలేదని సీతక్క ఆవేదన వెలిబుచ్చారు. ఆదివాసి గూడాలకు అభివృద్ధి అందినప్పుడే సమాజం అభివృద్ధి చెందినట్టు అని పేర్కొన్నారు. తరతరాలుగా కులాలు, జాతుల పేరా అణగారిన వర్గాలపై అణచివేత కొనసాగిందని, ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి కోసం ఎలాంటి ప్రణాళికలు అవసరమో మేధావులు నిర్ణయించాలన్నారు. అధికారులు చిత్తశుద్ధితో ప్రజల అవసరాలు తెలుసుకొని నివేదికలు అందజేస్తే నిధులు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అధికారులు, మేధావులు ప్రభుత్వం కలిసి పనిచేస్తేనే సమానత్వం సాధ్యమవుతుందని, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అంతా కలిసి అడుగులు వేయాల్సిన తరుణమిది నొక్కి వక్కాణించారు. ఆదివాసి ప్రాంతాల్లో విద్య, ఉద్యోగం, వైద్యం, రవాణా, తాగునీరు వంటి వసతులు అందేలా పనిచేయాలని సూచించారు.

### చట్టాలు సక్రమంగా అమలు చేయాలి..

ఐటిడిఏ పరిధిలో జీవో నెంబర్ 3 ను గత ప్రభుత్వం రద్దు చేసిందని, దాంతో స్థానిక గిరిజనులు ఉద్యోగం అవకాశాలు కోల్పోయారని మంత్రి తెలిపారు. ఎస్టీలకు పెంచిన 10 శాతం రిజర్వేషన్లు కోర్టులో పెండింగ్లో ఉన్నాయన్నారు. గిరిజన ఆదివాసీలను అభివృద్ధి పథంలో నిలపాలని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం 17 వేల కోట్ల బడ్జెట్ ను కేటాయించిందని, బడ్జెట్లో పెట్టిన ప్రతి రూపాయిని ఏజెన్సీ ప్రాంతాల్లో వెచ్చించి ఆదిమజాతి ప్రజలను అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చారు. అటవీ భూమి మీద ఆదివాసీలకు హక్కులు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అటవీ హక్కుల చట్టం తీసుకొచ్చిందని, కానీ మోడీ ప్రభుత్వం అటవీ హక్కుల చట్టానికి తూట్లు పొడిచేలా వ్యవహరిస్తోందన్నారు. గ్రామసభల అనుమతులు లేకుండానే ఆదివాసి ప్రాంతాల్లో యథేచ్ఛగా మైనింగ్ చేసేలా కేంద్రం చట్ట సవరణ చేసిందని, అటవీ ప్రాంతాల్లో మైనింగ్ కి అనుమతిస్తున్న ప్రభుత్వం అడవిలో ఉన్న గ్రామాలకు మాత్రం రోడ్లు వేసేందుకు అనుమతులు పెట్టలేదన్నారు.

### స్వచ్ఛతకు మారుపేరు..

అడవుల్లో, ఆదివాసి హృదయాల్లో స్వచ్ఛత ఉందని, కల్మషం లేని జీవితాలు ఆదివాసీల సొంతం అన్నారు. మన భాష సంస్కృతులే మన అస్తిత్వానికి ప్రతీకలని, అన్ని రంగాల్లో ఆదివాసీలు ముందుడాలని పిలుపునిచ్చారు. ఎక్కడ పేదరికం ఉంటే అక్కడ కాంగ్రెస్ సర్కార్ అండగా నిలుస్తుందని, పేదరిక నిర్మూలనే హస్తం సర్కార్ ధ్యేయమని సీతక్క పునరుద్ఘాటించారు.

## నీట్ వాయిదా వేయలేం..

### పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు

**జనపదం, ఢిల్లీ:** ఈ నెల 11న జరుగనున్న నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ పరీక్ష వాయిదా వేయాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను విచారించింది. పరీక్షకు రెండురోజుల ముందు పరీక్షను వాయిదా వేయాలని ఆదేశించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. 'ఇప్పుడు నీట్ పీజీని వాయిదా వేయిస్తున్నారా..? ఆ పరీక్షను ఎలా వాయిదా వేయగలం ? అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే వాదనలు వినిపించారు. ఉదయం ఒక పరీక్ష, మధ్యాహ్నం మరో పరీక్ష ఉన్నందున పరీక్షను రీషెడ్యూల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. రెండులక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉందని.. 50 మంది అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్ మేరకు పరీక్షను వాయిదా వేయాలని ఆదేశించలేమని చెప్పింది. కొందరు పిటిషన్లతో చాలామంది అభ్యర్థుల కెరీర్‌ను ప్రమాదంలో పడవేయలేమంటూ పిటిషన్‌ను కొట్టివేసింది.

## సీపీగెట్ ఫలితాలు రిలీజ్..

**జనపదం, ఎడ్యుకేషన్:** తెలంగాణ సీపీగెట్ ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబ్రాది శుక్రవారం విడుదల చేశారు. విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు సంబంధించిన రాత పరీక్షలను కంప్యూటర్ బేస్ట్ విధానంలో జూలై 6 నుంచి 16 వరకు నిర్వహించిన విషయం తెలిసిందే. నాలుగు, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కో ర్సుల్లో ప్రవేశానికి పరీక్షలు జరిగాయి. 45 కోర్సులకు మొత్తం 73,342 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. ఇందులో 64,765 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 61,246 మంది విద్యార్థులు అర్హత సాధించగా.. 96.55శాతం ఉత్తీర్ణత న మోదైంది. ఆయా విద్యార్థులకు రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాల మూరు, మహాత్మాగాంధీ, శాతవాహన, తెలంగాణ మహిళా యూనివర్సిటీతో పాటు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీల్లో పీజీ కోర్సులు ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్‌ఐసీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంఎస్సీ బయో టెక్నాలజీతో పాటు మొత్తం 41 కోర్సుల్లో 2024-25 కోసం విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు.

## డబ్బుల కోసం తల్లిని చంపిన కొడుకు

**జనపదం, మెదక్:** పింఛన్ డబ్బుల కోసం కన్నతల్లిని కొడుకు కడతేర్చిన సంఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేటకు చెందిన రామచంద్రం కొన్ని ఏండ్లుగా మద్యానికి బానిసై డబ్బుల కోసం ఇంట్లో తరుచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి పింఛన్ డబ్బులు ఇవ్వాలని తల్లి దుర్గవ్వ(70)తో గొడవపడ్డాడు. మద్యం మత్తులో చున్నీతో తల్లి మెడకు ఉరివేసి హత్య చేశాడు. సంఘటన స్థలానికి రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

# ఎన్నాళ్లీ చిల్లర దాడి..

- సుంకిశాల ఘటనకు సీఎందే బాధ్యత..
- కూలిందని తెలిసినా దాచిపెట్టారు..
- వారం రోజుల కిందటే సర్కార్‌కు ఘటన తెలుసు..
- అసెంబ్లీలో ప్రస్తావించకపోవడం కుట్ర కాదా..
- మంచైతే మాది.. చెడైతే మీదనే వ్యవహారం సరికాదు..
- మాజీ మంత్రి కేటీఆర్..
- సుంకిశాల ఘటనపై కాంగ్రెస్ సర్కార్‌కు సూటి ప్రశ్నలు..
- శాఖను చూస్తున్న సీఎం అసమర్థతతోనే ఘటన అంటూ మండిపాటు..




**జనపదం, బ్యూరో :** హైదరాబాద్ కు తాగునీటిని తరలించే సుంకిశాల ఇంటేక్ వెల్ ప్రాజెక్టు రీటైనింగ్ వాల్ వారం రోజుల క్రితం కూలిపోయిందని, ఈ ప్రమాదానికి పూర్తి బాధ్యత పురపాలక శాఖకు బాధ్యత వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ దేనని మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ ఘటన ఆగస్టు ఒకటిన జరిగిందని, అప్పుడు అసెంబ్లీ సమావేశాలు కూడా జరుగుతున్నాయని, ఆ ముచ్చట తెలిసిన సీఎం రేవంత్ రెడ్డికి అప్పుడే ఎందుకు బయట పెట్టలేదని ప్రశ్నించారు. శుక్రవారం తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి అసమర్థత, చేతగానితనం వల్లనే సుంకిశాల ప్రమాదం జరిగిందన్నారు. ప్రభుత్వం తప్పు లేకుంటే వారం రోజుల పాటు ఈ విషయాన్ని ఎందుకు దాచి పెట్టారన్నారు. ఆగమాగం పనులు ప్రారంభించటంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులే చెబుతున్నారని, అయినా వినకుండా గేట్లు అమర్చడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. కాగా, అదృష్టవశాత్తు కూలీలు షిఫ్ట్ మారినప్పుడు ప్రమాదం జరిగిందని, లేకుంటే చాలా ప్రాణనష్టం జరిగేదని వాపోయారు.

**మంచయితే మనది లేకుంటే ఇతరులదా..**

మంచి జరిగితే కాంగ్రెస్ ఘనకార్యమని, చెడు జరిగితే బీఆర్ఎస్ ప్రభుత్వం పాపమని తప్పుడు ప్రచారం చేసే చిల్లర ప్రయత్నాలు వద్దని, పురపాలక శాఖను పర్యవేక్షించకుండా ఉన్న ముఖ్యమంత్రిదే దీనికి బాధ్యత వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇకనైనా మాపైనే చిల్లర దాడి చేసే యత్నాన్ని విరమించుకోవాలన్నారు. ఎన్నికల్లో ప్రయోజనం కోసం కాళేశ్వరంపై చేసిన అడ్డగోలు వాదనలుగా తేలిపోయిందన్నారు. 12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిన ప్రాజెక్టు చెక్కుచెదరకుండా ఉందన్నారు. కాళేశ్వరంపై ఆగమేఘాల మీద రి పోర్ట్ ఇచ్చారని, ఇప్పటి వరకు ఏ కేంద్ర సంస్థ రాలేదంటే ఇది ముమ్మాటికీ కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కే అని అనుకోవాల్సి వస్తోందన్నారు. ఈ అంశంపై మంత్రి బట్టి జ్యుడిషియల్ ఎంక్వైరీ వేయాలన్నారు.

**ప్రభుత్వ ఆలోచన విధానంలో లోపం..**

సుంకేశాల ప్రాజెక్టు ఇంజనీరింగ్ లో ఎలాంటి లోపం లేదని, ఈ రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన విధానంలో లోపం ఉన్నదని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ దివాలా కోరు విధానం తప్ప, ఇప్పటిదాకా తీసుకొచ్చిన విధానాలు ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డలో జరిగిన సంఘటనను మేం దాయలేదని, ఎన్నికల కోడ్ ఉన్న సరే ప్రమాదం జరిగిన విషయాన్ని చెప్పామని గుర్తు చేశారు. అలాగే ఘటన జరిగిన గంటల్లోనే మేము లోపాలు సర్దుతామని ఎల్ అండ్ టీ చెప్పిం, మాకు సీక్రెసీ మెయింటెన్ చేయాల్సిన అవసరం లేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే కాంట్రాక్ట్ సంస్థను బ్లాక్ లిస్ట్ పెట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**తప్పుడు ప్రచారాలు చేయవద్దు.**

సుంకిశాల విషయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇతరులపై తప్పుడు ప్రచారాలు చేయవద్దని కేటీఆర్ హితవు పలికారు. ఒకవేళ ముఖ్యమంత్రికి విషయం తెలియకపోతే ఆయన పరిపాలనపై పట్టు లేనట్లేనన్నారు. ప్రమాదానికి కారణమైన సొమ్మును ప్రభుత్వం దుర్వినియోగం చేసిందన్నారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి హయాంలో దీనికోసం ప్రతిపాదన చేశారని, అప్పట్లో మాకు అన్యాయం చేయొద్దంటూ రైతులు అడ్డుకోవటంతో అక్కడ ఒక సబ్ ఇన్ స్పెక్టర్ కూడా చనిపోయారని గుర్తు చేశారు. ఆ తరువాత ప్రభుత్వాల హయాంలో రెండు, మూడు దశలు అంటూ ప్రభుత్వం ప్రతిపాదన తెచ్చినా, రైతులు మళ్లీ అడ్డుకోవటంతో ప్రాజెక్ట్ ఆగిపోయిందన్నారు. ఆ తర్వాత కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఏక బిగిన సాగునీటి ప్రాజెక్ట్ లు చేపట్టారన్నారు. రైతుల్లో విశ్వాసం నింపటంతో సుంకిశాలను రైతులు అడ్డుకోలేదని, ఎలిమినేటి ప్రాజెక్ట్ ద్వారా నీళ్లు ఎత్తిపోయాలంటే సాగర్లో 510 అడుగుల నీళ్లు ఉంటేనే నీళ్లు తీసుకోవటం సాధ్యమవుతుందన్నారు.

**హైదరాబాద్ నీటి అవసరాలకు అనుగుణంగా**

సుంకిశాలలో మాత్రం 462 అడుగులు ఉన్నా సరే నీళ్లు తీసుకోవచ్చని తెలిపారు. రాబోయే 50 ఏళ్లలో హైదరాబాద్ నీటి అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్ట్ ను కేసీఆర్ చేపట్టారు.

నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ ప్రజా ప్రతినిధులంతా కలిసి దానికి శంకుస్థాపన చేసి, శరవేగంగా ప్రాజెక్ట్ ను ముందుకు తీసుకెళ్లామన్నారు. మూడు పైప్ లైన్ల ద్వారా ఈ ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. కృష్ణానది కి మూడు, నాలుగేళ్లు వరద రాకపోయిన డెడ్ స్టోరేజ్ నుంచి సుంకిశాల ద్వారా నీళ్లు తేవచ్చని, ఓఆర్ఆర్ చుట్టు ఒక రింగ్ మెయిన్ చేయాలనే ఉద్దేశంతో గోదావరి, కృష్ణా నీళ్లు తీసుకొచ్చే ప్రయత్నం చేశారన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ విషయాలేమీ తెలియవన్నారు. ఢిల్లీ, బెంగళూరు లాంటి చాలా నగరాల్లో భారీగా నీటి కొరత ఉందని,, దేశ రాజధాని ఢిల్లీలో నీటి కోసం యుద్దాలు జరుగుతున్నా, హైదరాబాద్ లో మాత్రం ఆ పరిస్థితి లేదన్నారు. హైదరాబాద్ కు తాగు నీటి కరువు ఉండకుండా చేసేందుకే ఈ ప్రాజెక్ట్ చేపట్టామన్నారు. సీతారామా ప్రాజెక్ట్ గురించి భట్టి బిల్డప్ ఇచ్చారని, కానీ ఆ ప్రాజెక్ట్ ను చేపట్టింది,, పూర్తి చేసింది కూడా కేసీఆరేనన్నారు.

**సుంకిశాల ప్రమాదం కాంగ్రెస్ వైఫల్యం**

2024 సమ్మర్ నాటికి సుంకిశాలను పూర్తి చేయాలని బీఆర్ ఎస్ సర్కారు లక్ష్యంగా పెట్టుకుందని, ఒక్క మోటార్ ఫిట్టింగ్ పనులు మాత్రమే ఉండేనని, కానీ ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు మొత్తం పనులను పెండింగ్ పెట్టిందన్నారు. పురపాలక శాఖలో మొత్తం పనులను పడకేశాయని, ముఖ్యంగా సుంకిశాల పనులను పక్కన పెట్టిందన్నారు. ఈ క్రమంలో వేసవి రావడంతో హైదరాబాద్ ప్రజలకు ట్యాంకర్లే గతి కావడంతో ప్రభుత్వం మీద తీవ్ర విమర్శలు వచ్చాయన్నారు. సీఎం మీద కూడా విమర్శలు రావడంతో ఆయన రెండు, మూడు నెలల కిత్రం దున్నపోతు నిద్ర వీడారన్నారు. ఆ తర్వాత అధికారులను ఒత్తిడి పెట్టి ఆగమాగం పనులు చేపట్టాని, ఈ క్రమంలో ఈ ఘటన జరిగింద్నారు. సంకిశాల ప్రమాదం రేవంత్ రెడ్డి వైఫల్యంమని అందుకే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాన్నారు.

**పరిపాలన చేతకాకే..**

పరిపాలన చేతకాని రేవంత్ సర్కారు ప్రతి దానికి కేసీఆర్ పై తప్పుడు ప్రచారం చేస్తుండడం దారుణమని కేటీఆర్ వాపోయారు. హైదరాబాద్ లో లా అండ్ ఆర్డర్ సరిగా లేదని, వాళ్ల బాకా ఊదే పత్రికలే లా అండ్ ఆర్డర్ మీద కథనాలు రాస్తున్నాయన్నారు. పేర్లు మార్చటమేనా మార్పు అంటే...భట్టి తన ఆలోచన విధానాన్ని మార్చాలని హితవుచెప్పారు. మేము కూడా సుంకిశాలకు వెళ్లి మొత్తం వివరాలను అక్కడ నుంచి వివరిస్తామన్నారు. 10 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉన్న సరే మేడిగడ్డకు ఏమీ కాలేదని, ఇన్నాళ్లు కాళేశ్వరమంతా చిల్లర, దివాళా కోరు ప్రచారాలు. ప్రకృతే వీళ్ల తప్పుడు ప్రచారాలకు సమాధానం చెప్పిందన్నారు. వాళ్లకు సరుకు లేదు, సబ్జెక్ట్ లేదని, వీళ్లకు బ్యారేజ్ గేట్లు ఎప్పుడు దించుతారో కూడా తెలియదని ఎద్దేవా చేశారు. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు ఎత్తిపోయటానికి ఎలాంటి ఇబ్బంది లేదని, ఇంత మంచి ప్రాజెక్ట్ ను తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఇంజనీర్లే ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

కాళేశ్వరం ఫెయిల్ అయితే అన్ని రిజర్వాయర్లకు నీళ్లు ఎలా వస్తున్నాయని, ఇది మూర్ఖ, కుచ్చిత మనస్తత్వం ఉన్న ప్రభుత్వమని, నీళ్ల విషయంలో కేసీఆర్ కు పేరు వస్తదనే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి చేతగానీ తనం కారణంగానే వారం రోజుల పాటు ఈ అంశాన్ని దాచిపెట్టారని, ఒక వేళ ఈ విషయం రేవంత్ రెడ్డికి తెలియకపోతే ముఖ్యమంత్రిగా పరిపాలన మీద ఆయనకు ఎంత పట్టు ఉన్నట్లు అని మాజీ మంత్రి కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు.

## సుంకిశాలతో సంబంధం లేదు..

(మొదటి పేజీ తరువాయి)

నాగార్జున సాగర్ వరద ప్రవాహం ఎక్కువగా రావడంతో కూలిపోయిన సుంకిశాల సైడ్ వాల్ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ గోదావరి నదిపై ప్రాజెక్టుల నిర్మాణం జరిగినంత వేగంగా కృష్ణానదిపై ప్రాజెక్టుల పనులు జరగలేదన్నారు. సుంకిశాల ప్రాజెక్టు ఎందుకు ప్రారంభించారో కేసీఆర్, కేటీఆర్ కే తెలియాలని, హైదరాబాద్ జంట నగరాలకు తాగునీరు అందించేందుకు సుంకిశాల ప్రాజెక్టు అవసరం లేదన్నారు. ఇది కేసీఆర్ మానస పుత్రికనో లేక కేటీఆర్ మానస పుత్రికనో అర్థం కావడం లేదని దుయ్యబట్టారు. కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సుంకిశాల ప్రాజెక్టుకి శంకుస్థాపన చేశారు, కాంట్రాక్టర్లను ఎంపిక చేసి పనులు చేయించారన్నారు. జరిగిందంతా అప్పుడే జరిగింది, మా ప్రభుత్వంతో ఏ సంబంధం లేదన్నారు. జరిగిన నష్టాన్ని మొత్తము కాంట్రాక్టరే భరిస్తారని, ప్రాజెక్టు పనులను పూర్తి చేసి ఇస్తారన్నారు. అనవసరపు విమర్శలు.. కేటీఆర్ అనవసరమైన రాజకీయ విమర్శలు చేయడం కరెక్ట్ కాదని వారు హితవు పలికారు. జరిగిన ఘటన చిన్నదని, నష్టం కూడా తక్కువేనని, నష్టం కాంట్రాక్టర్ భరిస్తారన్నారు. దానితో ప్రజలకు, ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడానికి ఒకటి, రెండు నెలల ఆలస్యం అవుతుందన్నారు. గత ప్రభుత్వం ఎస్ ఎల్ బీసీ పూర్తి చేయలేదని, దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. డిండి ఎత్తిపోతల పథకం సైతం పూర్తి చేస్తామని, బీఆర్ ఎస్ ఎందుకు విమర్శలు చేస్తున్నదో అర్థం కావడం లేదని, సుంకిశాల అన్ని పనులు వారి హయంలోనే జరిగాయన్నారు. సోషల్ మీడియా ద్వారానే సుంకిశాల ప్రమాదం ప్రభుత్వానికి తెలిసిందని, వెంటనే ప్రభుత్వం స్పందంచిందన్నారు. హైదారాబాద్ వాటర్ వర్క్స్ విచారణ జరుపుతోందని, సీఎం వచ్చిన తరువాత చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్ ఎస్ వాళ్ళు కాంగ్రెస్ ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందని, ఘటనపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ చేస్తుందన్నారు. నష్టం అంతా నిర్మాణ సంస్థ భరిస్తుందని, అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు.



## గుట్టలుగా నోట్ల కట్టలు..

- నిజామాబాద్ మున్సిపల్‌లో అవినీతి తిమింగలం..
- రెవెన్యూ అధికారి దాసరి నరేందర్ ఇంటిపై ఏసీబీ దాడులు..
- పట్టుబడిన రూ.2.93 కోట్ల నగదు..
- ఖాతాల్లో రూ.1.10 కోట్లు..
- అరకిలో బంగారం., 17 స్థిరాస్తుల గుర్తింపు..
- కేసు నమోదు.. కొనసాగుతున్న విచారణ

**జనపదం, నిజామాబాద్:** గుట్టలుగా నోట్ల కట్టలు.. కిలోల కొద్దీ బంగారు నగలు.. బ్యాంకు అకౌంట్లలో కోట్లలోనే బ్యాలెన్సులు.. ఇదంతా ఓ రెవెన్యూ అధికారి అవినీతి బాగోతం. ఏసీబీ అధికారుల దాడుల్లో ఈ భారీ అవినీతి తిమంగలం వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ మున్సిపల్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న దాసరి నరేందర్‌పై వచ్చిన అవినీతి ఆరోపణల మేరకు.. ఆయన నివాసంపై ఏసీబీ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. అధికారులు నిర్వహించిన ఈ తనిఖీల్లో కళ్ల బైర్లు కమ్మేలా సొత్తు బయటపడింది. భారీగా డబ్బు, బంగారం లభించింది. ఉదయం 5 గంటల నుంచి సోదాలు చేయగా.. సాయంత్రం వరకు 7 కోట్లకు పైచిలుకు అక్రమాస్తులను అధికారులు గుర్తించారు. ఇంటితో పాటు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, కోటగల్లి, నిర్మల్‌లోని నరేందర్‌కు సంబంధించిన బంధువుల ఇళ్లలో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. నరేందర్ ఇంట్లోనే 3 కోట్ల నోట్ల కట్టలను అధికారులు గుర్తించారు. నరేందర్ భార్య బ్యాంకు ఖాతాలో మరో కోటి రూపాయల బ్యాలెన్స్ ఉన్నట్టుగా గుర్తించారు. ఇక.. ఇంట్లో 51 తులాల బంగారు ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మరో 2 కోట్ల విలువైన స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలను గుర్తించారు. ఇక ఆయన బంధువులకు సంబంధించిన ఇళ్లలో దొరికిన సొత్తు వివరాలు తెలియాల్సి ఉంది. మొత్తంగా.. నరేందర్ 50 కోట్లకు పైగానే ఆస్తులు కూడబెట్టాడంటూ పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. కాగా.. ప్రస్తుతం ఆదాయానికి మించి ఆస్తులను కూడబెట్టినట్టు తేలటంతో.. కేసు నమోదు చేసిన అధికారులు.. నరేందర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



## ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ..

**జనపదం, హైదరాబాద్ :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 502 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 112 , మైనారిటీ వెల్ఫేర్ 71, పౌరసరఫరాల శాఖ 69 , పంచాయత్ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ 42 , మున్సిపల్ శాఖ 35, ఇతర శాఖలకు సంబంధించి 173 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య దరఖాస్తులు స్వీకరించారు. ప్రజా భవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను ఆయా శాఖలకు పంపి త్వరితగతిన సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు.

## త్వరలో కవితకు బెయిల్..

(మొదటి పేజీ తరువాయి)



సిసోడియా బెయిల్ అంశంపై ఆలోచించి మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో పొలిటికల్ గా కొట్లాడాల్సి వచ్చినప్పుడు ఇలాంటి ఇబ్బందులు తప్పవని ఒకనొక సం దర్భంగా కవిత అరెస్టు ఘటనలోని రాజకీయ దుమారంపై స్పందించారు. కవితను జైలులో చూసినప్పుడు చిక్కిపోయిందని, పరిసరాలు శుభ్రంగా లేవని, శుభ్రత సరిగా లేదన్నారు. 11 వేల మంది ఉండాల్సిన చోట 30 వేల మంది ఖైదీలను ఉంచుతున్నారని పేర్కొన్నారు. అయినా జై లుకు వెళ్లొచ్చిన వారు భవిష్యత్ లో పెద్ద లీడర్లు అయ్యే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోందని కేటీఆర్ తన దైన శైలిలో చెప్పారు. కాగా, లిక్కర్ కేసులో కవితను మార్చి 15వ తేదీన ఈడీ అరెస్ట్ చేయగా, ఏప్రిల్ 11వ తేదీన సీబీఐ అరెస్ట్ చేసింది. అప్పటి నుంచి తిహార్ జైలులో శిక్షను అనుభవిస్తున్నారు.




## తెలంగాణ.. ది ఫ్యూచర్‌స్టేట్

- ట్యాగ్ లైన్ ఖరారు చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- కాలిఫోర్నియాలో ఏఐ యూనికార్న్‌కంపెనీ ప్రముఖులతో సమావేశం

**జనపదం, బ్యూరో:** 'ఇప్పటి వరకు మేము న్యూయార్క్, న్యూజెర్సీ, వాషింగ్టన్ డీసీ, టెక్సాస్‌లో పర్యటించాం. ఇప్పుడు కాలిఫోర్నియాలో ఉన్నాం. అమెరికాలో ప్రతి రాష్ట్రానికి ఒక ప్రత్యేక లక్ష్యం.. ఆ లక్ష్యాన్ని సూచించే నినాదం ఉంది. అవుటాఫ్ మెనీ.. వన్ అనేది న్యూయార్క్ స్టేట్ నినాదం. టెక్సాస్‌ను లోన్ స్టార్ స్టేట్ అని పిలుస్తారు. కాలిఫోర్నియాకు యురేకా అనే నినాదం ఉంది. అయితే మన ఇండియాలోని రాష్ట్రాలకు ఇటువం టి ప్రత్యేక నినాదాలేమీ లేవు. ఇప్పటినుంచి తెలంగాణ రాష్ట్రానికి అలాంటి ఒక లక్ష్య నినాదాన్ని ట్యాగ్ లైన్ గా పెట్టుకుందాం. ఇకపై రాష్ట్రాన్ని తెలంగాణ ఫ్యూచర్ స్టేట్ .. అని పిలుద్దాం..' అని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ పునర్నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, నెట్ జీరో సిటీ లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ రాష్ట్రం 'ది ఫ్యూచర్ స్టేట్'కు పర్యాయపదంగా నిలుస్తుందని సీఎం ప్రకటించారు. కాలిఫోర్నియాలో ఇండియన్ కాన్సులేట్ జనరల్ నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బిజినెస్ రౌండ్‌టేబుల్‌లో టెక్ యునికార్న్స్ సీఈఓలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ఐటీ యూనికార్న్ ప్రతినిధులందరూ తెలంగాణకు రావాలని ఆహ్వానించారు. మీ భవిష్యత్తును ఆవిష్కరించుకోండి... అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డి అమెరికాలోని ఐటీ సర్వీసెస్ కంపెనీల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఐటీ సంస్థల అసోసియేషన్ ఐటీ సర్వీస్ అలయెన్స్ సమావేశంలో సీఎంతో పాటు మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న ప్రాజెక్టులలో ప్రవాసులు భాగస్వాములు కావాలని కోరారు. హైదరాబాద్ ప్రస్తుతం పెట్టే ప్రతీ రూపాయి తప్పకుండా భవిష్యత్తుకు పెట్టుబడిగా ఉపయోగపడుతుందని సీఎం వివరించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రపంచ టెక్ పరిశ్రమలకు తెలంగాణలో అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. పెట్టుబడులకు అనుకూలమైన విధానాలను తమ ప్రభుత్వం అనుసరిస్తుందని స్పష్టం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యునికార్న్ కంపెనీల వ్యవస్థాపకులు స్వయంగా హైదరాబాద్‌ను సందర్శించాలని మంత్రి ఆహ్వానించారు. అక్కడ పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సదుపాయాలను పరిశీలించాలని కోరారు. రాబోయే ద శాబ్దంలో హైదరాబాద్‌ను పునర్ నిర్మించే భారీ వ్యూహంతో తమ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ, మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులను చేపట్టిందని అన్నారు. హైదరాబాద్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీ సెంటర్ గా అభివృద్ధి చెందుతుందని, ప్రపంచస్థాయి ప్రమాణాలున్న భవిష్యత్తు నగరంగా మారుతుందని స్పష్టం చేశారు.



## హైదరాబాద్‌లో ఆమ్‌జెన్ రీసెర్చ్ సెంటర్

- ఈ ఏడాది చివర్లో ప్రారంభం
- 3 వేల మందికి ఉద్యోగాలు

**జనపదం, బ్యూరో :** అమెరికాలోనే అతి పెద్ద బయో టెక్నాలజీ కంపెనీ ఆమ్‌జెన్ తెలంగాణలో కార్యకలాపాలను విస్తరించనుంది. హైదరాబాద్ లో కొత్తగా రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ విభాగం ప్రారంభించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. హైటెక్ సిటీలో ఆరు అంతస్తుల భవనంలో ఈ సెంటర్ ఉంటుంది. దాదాపు 3 వేల మందికి ఇక్కడ ఉద్యోగాలు లభిస్తాయి. ఈ ఏడాది చివరి త్రైమాసికం నుంచే కంపెనీ తమ కార్యకలాపాలు ప్రారంభించనుంది. సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు శాన్ ఫ్రాన్సిస్కోలోని ఆమ్జెన్ ఆర్ అండ్ డీ కేంద్రంలో కంపెనీ ఎండీ డాక్టర్ డేవిడ్ రీస్, నేషనల్ ఎక్స్క్యూటివ్ మిస్టర్ సోమ్ చటోపాధ్యాయతో సమావేశమయ్యారు. అనంతరం సీఎం మాట్లాడుతూ ప్రపంచంలో పేరొందిన బయోటెక్ సంస్థ హైదరాబాద్‌ను తమ కంపెనీ అభివృద్ధి కేంద్రంగా ఎంచుకోవటం గర్వించదగ్గ విషయమన్నారు. బయో టెక్నాలజీ రంగంలో హైదరాబాద్ ప్రాధాన్యం మరింత ఇనుమడిస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచ స్థాయి సాంకేతికతతో రోగులకు సేవ చేయాలని ఎంచుకున్న లక్ష్యం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. కంపెనీ ఎండీ డాక్టర్ రీస్ మాట్లాడుతూ 40 ఏళ్లుగా తమ కంపెనీ బయో టెక్నాలజీ రంగంలో అగ్రగామి సంస్థగా గుర్తింపు సాధించిందని అన్నారు. డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కలయికతో కొత్త ఆవిష్కరణలతో మరింత సేవలను అందించేందుకు ఈ సెంటర్ ఏర్పాటు అద్భుతమైన మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. భారత్ లో తమ కంపెనీ విస్తరణకు సోమ్ చటోపాధ్యాయను నేషనల్ ఎగ్జిక్యూటివ్ గా గా నియమించినట్లు చెప్పారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల మాట్లాడుతూ ఆమ్‌జెన్ ఇండియా హైదరాబాద్ ను కేంద్రంగా ఎంచుకోవటం ఆనందంగా ఉందన్నారు. ఈ నిర్ణయం తెలంగాణలో అందుబాటులో ఉన్న ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ పర్యావరణ వ్యవస్థను చాటిచెపుతుందన్నారు. కంపెనీ విస్తరణకు తగినంత మద్దతు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఆమ్ జెన్ కంపెనీ ప్రపంచంలో వంద దేశాల్లో విస్తరించి ఉండగా, దాదాపు 27 వేల మంది ఉద్యోగులున్నారు.

# దాచి పెట్టాల్సిన అవసరం లేదు..

- క్షమాపణ చెప్పాల్సింది పోయి ఎదురుదాడా..?
- కేసీఆర్ సొంత నిర్ణయం వల్లే సుంకిశాల ఘటన
- ఇరిగేషన్ శాఖను భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్
- 15న వైరాలో రాజీవ్ లింక్ కెనాల్ కు సీఎం ప్రారంభోత్సవం
- ముఖ్యమంత్రి పర్యటను సక్సెస్ చేయాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**జనపదం, బ్యూరో :** బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రాజెక్టు నాణ్యత లోపాల అవినీతిని ఎప్పుడు బయటపెట్టాలని చూస్తున్న మాకు సుంకిశాల ఘటనను దాచి పెట్టాల్సిన అవసరం లేదని, ఈ ఘటనలో పొరపాటును ఒప్పుకొని ప్రజలకు క్షమాపణ చెప్పాల్సింది పోయి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం పై ఎదురుదాడి చేయడం సరికాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రాజెక్టు విషయంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను శుక్రవారం ఖమ్మం జిల్లా వైరా మండలం స్థానాల లక్ష్మీపురం గ్రామంలో ఖండించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుంకిశాల ఘటనతో కృష్ణా నదిపై బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల నాణ్యతపై విచారణ చేయిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కాళేశ్వరం, సుంకిశాల ప్రాజెక్టులను నిర్మించారని, నీళ్లు రాకుండానే కాళేశ్వరం కృంగిపోగా, నీళ్లు వచ్చిన తర్వాత సుంకిశాల ప్రాజెక్టు మునిగిందన్నారు. నాగార్జునసాగర్ డెత్ స్టోరేజ్ వద్ద నిర్మించే ప్రాజెక్టుకు నీళ్లు రాకుంటే మరేం వస్తాయని, సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ కట్టింది మీ ప్రభుత్వ హయాంలో కాదా? అని ప్రశ్నించారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు అక్కడ కట్టడం సరికాదని కాంగ్రెస్ ముందే చెప్పినా వినకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మిస్తే ఇప్పుడు ఫలితం ఏంటో అందరం చూస్తున్నామన్నారు. ఇంజనీర్లు చెప్పింది కాదని కేసీఆర్ సొంత నిర్ణయాలు తీసుకొని కాళేశ్వరం కట్టడం వల్లే కుంగుబాటుకు కారణమైందని చెప్పారు.

**దాచి పెట్టాల్సిన అవసరం లేదు..**

బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రాజెక్టు నాణ్యత లోపాల అవినీతిని ఎప్పుడు బయటపెట్టాలని చూస్తున్న మాకు సుంకిశాల ఘటనను దాచి పెట్టాల్సిన అవసరం లేదని బట్టి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మొదలు పెట్టిన ప్రాజెక్టులకు రీ డిజైన్ చేసి ఇరిగేషన్ శాఖను బీఆర్ఎస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందన్నారు. రూ. 1450 కోట్లతో పూర్తయ్యే రాజీవ్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను రీ డిజైన్ చేసి సీతారామ ప్రాజెక్టుగా పేరు మార్చి రూ. 23 వేల కోట్లకు అంచనాలు పెంచి రాష్ట్ర ఖజానాను బీఆర్ఎస్ ప్రభుత్వం దోపిడీ చేసిందని ఆరోపించారు. సీతారామ ప్రాజెక్టుపై ఎనిమిది వేల కోట్ల రూపాయల ఖర్చుపెట్టి ఒక ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదని, హైదరాబాద్ సరూర్ నగర్ లో జరిగిన బహిరంగ సభలో ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ సైతం ప్రస్తావించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీతారామ ప్రాజెక్టు పై పెట్టిన ఖర్చు వృథా కాకుండా ఉండడానికి ముఖ్యమంత్రి భద్రాచలం పర్యటనకు వచ్చినప్పుడు ఇంజనీర్లతో కలిసి రాజీవ్ గాంధీ లింకు కెనాల్ ను ప్రతిపాదించారన్నారు.

**నిబద్ధతకు నిదర్శనం కాంగ్రెస్**

కేవలం రూ.75 కోట్లతో రాజీవ్ లింకు కెనాల్ ను మూడు నెలల్లో పూర్తి చేసి లక్షా 50 వేల ఎకరాలకు సాగునీరు అందించే కార్యక్రమం చేపట్టామని డిప్యూటీ సీఎం తెలిపారు. మూడు నెలల్లో రాజీవ్ లింకు కెనాల్ కాలువను పూర్తి చేసి రైతులకు నీళ్లు ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఈ నెల 15న వైరా పట్టణంలో రాజీవ్ లింక్ కెనాల్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు.



పంద్రాగస్టు నాటికి రుణమాఫీ సంపూర్ణంగాఅమలు చేస్తామన్న మాటకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని, దేశానికి స్వాతంత్రం సిద్ధించిన రోజున రైతులను రుణ విముక్తులను చేసే ఉన్నతమైన కార్యక్రమానికి ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం చేపడుతున్నదన్నారు. 15 నాడు రాష్ట్రంలో ఉన్న రైతులకు వైరా వేదిక సాక్షిగా రూ.2 లక్షల రుణమాఫీని ప్రజా ప్రభుత్వం చేయనుందని, జూలై 18న రైతు రుణమాఫీ ప్రారంభించి రెండు విడతల్లో 16 లక్షల 29 వేల కుటుంబాలకు రూ.లక్షన్నర వరకు రైతు రుణమాఫీ చేయడానికి వారి ఖాతాల్లో రూ.12,298 కోట్లను జమ చేశామని గుర్తు చేశారు. రెండు లక్షల రుణమాఫీ అమలు, రాజీవ్ లింకు కెనాల్ ప్రారంభోత్సవం సందర్భంగా వైరా పట్టణంలో ఆగస్టు 15 ఏర్పాటు చేసే సభకు సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలు హాజరవుతారని, ఈ సభకు వేలాదిగా తరలివచ్చి రైతులు ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## ఎన్టీఆర్ నీల్ మువీ షురూ..

**యంగ్ టైగర్ ఎన్టీఆర్**, కన్నడ స్టార్ దర్శకుడు కేజీఎఫ్, సలార్ చిత్రాల ఫేమ్ ప్రశాంత్ నీల్ కాంబోలో సినిమా రానున్న విషయం తెలిసిందే. #NTRNeel గా రానున్న ఈ సినిమాను గతేడాది ప్రకటించగా తాజాగా పట్టాలెక్కలేదు. శుక్రవారం ఈ సినిమా షూటింగ్ ను పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. రామానాయుడు స్టూడియోస్‌లో ఈ వేడుక జరుగగా.. ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ ఇరు కుటుంబ సభ్యులు ఈ ఈవెంట్‌కు హాజరయ్యారు. అయితే ఈ ఈవెంట్‌కు తారక్ హాజరు కావాట్లేదని సోషల్ మీడియాలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ వార్తలకు చెక్ పెడుతూ.. ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టాడు. తారక్ భార్య లక్ష్మీ ప్రణతి కెమెరా స్విచ్ ఆన్ చేసింది. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ భారీ బడ్జెట్‌తో నిర్మించబోతుంది. ఈ సినిమాను జనవరి 09 2026లో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

## జాతర

టాలీవుడ్‌లో డైరెక్టర్లు హీరోలు అవుతున్నారు.. హీరోలు డైరెక్టర్లుగా మారుతున్నారు. అయితే, సినిమాలో కంటెంట్ ఉంటే ఆడియెన్స్ తప్పక ఆదరిస్తారనేది చాలా సినిమాలతో ప్రూవ్ అయింది. తాజాగా అదే బాటలో మరో సినిమా రానుంది. సతీష్ బాబు హీరోగా నటిస్తూ కథ రాసుకోవడంతో పాటు డైరెక్ట్ చేస్తున్న మూవీ 'జాతర'. గల్లా మంజునాథ్ సమర్పణలో మూవీటెక్ ఎల్ఎల్‌సితో కలిసి రాధాకృష్ణ ప్రొడక్షన్ కంపెనీ బ్యానర్‌పై రాధాకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్న ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. రా అండ్ రస్టిక్ లుక్‌తో ఈ పోస్టర్ ఉండటంతో ప్రేక్షకుల్లో ఈ సినిమాపై మంచి బజ్ క్రియేట్ అయ్యింది. ఇక ఈ సినిమా పోస్టర్ పై "దేవుడు ఆడే జగన్నాటకంలో.. ఆ దేవునితో మనిషి ఆడించే పితలాటకం" అనే డైలాగ్ ఉండటం ఆసక్తిని క్రియేట్ చేస్తోంది. పాలేటి గంగమ్మ దేవత బ్యాక్‌డ్రాప్ లో ఈ సినిమా కథ ఉంటుందని పోస్టర్ చూస్తే అర్థమవుతోంది. ఈ చిత్రంలో దీయా రాజ్ కథానాయికగా నటిస్తుండగా.. ఆర్.కె. పిన్నపాల, గోపాల్ రెడ్డి, మహబూబ్ బాషా, సాయి విక్రాంత్ సహాయక పాత్రల్లో నటించారు.




## మహేశ్ బాబు.. నయా లుక్

స్టార్ యాక్టర్ మహేశ్‌బాబు పుట్టినరోజును అభిమానులు ఘనంగా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. ఆయన బర్త్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ.. హారికా అండ్ హాసిని క్రియేషన్స్ సస్పెన్స్ లుక్ ఒకటి విడుదల చేసింది. మహేశ్ బాబు అగ్రెసివ్‌గా కనిపిస్తున్న ఈ స్టిల్ గుంటూరు కారంలో నిదంటూ ఫ్యాన్ తెగ చర్చించుకుంటున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ గుంటూరు కారం సినిమా కోసం డిఫరెంట్ స్క్రిప్టును సిద్ధం చేయడమే కాదు.. అందుకనుగుణంగా కొన్ని పోర్షన్లను కూడా చిత్రీకరించాడట. అయితే పలు కారణాల వల్ల ఆ సన్నివేశాలను తొలిగించారని.. అందులో నిదే ఈ స్టిల్ అని చర్చ నడుస్తోంది. గుంటూరు కారం ప్రమోషన్స్‌లోనే ఈ పోస్టర్ విడుదల చేస్తే బాగుండేది అని కొందరు అభిమానులు అభిప్రాయపడుతున్నారు. తాజా స్టిల్ గుంటూరు కారం ఫస్ట్ లుక్‌ను డామినేట్ చేసేలా ఉండటం వల్లే సస్పెన్స్ లుక్‌ను సీక్రెట్‌గా ఉంచారని టాక్ వినిపిస్తోంది. మొత్తానికి అయితే ఈ కొత్త లుక్ మాత్రం అభిమానులను థ్రిల్ అందిస్తోంది.





## ఎంది స్వామి ఇది..?

**శోభిత చై విడిపోతారు..**

**జాతకం చెప్పిన వేణు స్వామి**

ప్రముఖ జోతిష్యుడు వేణు స్వామి సెలబ్రిటీల జాతకం చెబుతూ.. ఆయన కూడా ఓ సెలబ్రిటీ అయిపోయాడు. అయితే ఈ మధ్య ఆంధ్రప్రదేశ్ ఎన్నికలలో జగన్ గెలుస్తాడని చెప్పి బొక్కబోర్లా పడ్డాడు. దీంతో ఆయనపై విపరీతంగా ట్రోల్స్ వచ్చాయి. ఇక ట్రోల్స్‌ని తట్టుకోలేని వేణుస్వామి ఇకపై తాను ఎవరి జాతకం చెప్పనని ప్రకటించాడు. దీంతో ఈ వివాదం సద్దుమణిగింది. అయితే తాజాగా ఎంగేజ్‌మెంట్ చేసుకున్న నాగచైతన్య, శోభిత ధూళిపాళ్ల జంటపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. నాగచైతన్య, శోభిత దూళిపాళ్ల జాతకం కలవలేదని అలాగే వాళ్లిద్దరు ఎంగేజ్‌మెంట్ చేసుకున్న సమయం కరెక్ట్ కాదని వేణు స్వామి వెల్లడించాడు. నాగచైతన్య– శోభిత పెళ్లి చేసుకున్న అనంతరం ఒక అమ్మాయి వలన 2027లో విడిపోతారని ప్రకటించాడు. అయితే వారిద్దరూ కలిసి ఉండాలని తన జోతిష్యం తప్పుకావలని వేడుకుంటున్నట్లు వేణు స్వామి తెలిపాడు. ఆయన వ్యాఖ్యలతో.. వేణు స్వామిపై నెటిజన్లు మళ్లీ ట్రోల్స్ స్టార్ట్ చేశారు. శుభమా అని ఆ జంట ఎంగేజ్మెంట్ చేసుకుంటే ఇలాంటి అశుభ మాటలెందుకండి?. అసలు వారి జాతకం చెప్పమని మిమ్మల్ని ఎవరు అడిగారు? ప్రైవేట్ వ్యక్తుల జీవితాల్లోకి ఎందుకు చొరబడుతున్నారు? అంటూ కామెంట్లు పెడుతున్నారు.

## మిస్టర్ బచ్చన్‌కు యు/ఎ

మాస్ రాజా రవితేజ నటించిన లేటెస్ట్ మూవీ 'మిస్టర్ బచ్చన్'. దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కించిన ఈ సినిమా పూర్తి మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోంది. ఇక ఈ సినిమా ప్రమోషన్స్‌ను మేకర్స్ జోరుగా చేస్తున్నారు. తాజాగా.. ఈ సినిమా సెన్సార్ పనులు కూడా ముగించుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు యు/ఎ సర్టిఫికెట్ జారీ చేసిందట. మాస్ అంశాలు పుష్కలంగా ఉన్న ఈ మూవీ ఆడియెన్స్‌ను ఎంటర్‌టైన్ చేయడం ఖాయమని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమాను బాలీవుడ్ సూపర్ హిట్ మూవీ 'రెయిడ్'కు రీమేక్‌గా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇక మిస్టర్ బచ్చన్ చిత్ర రన్‌టైమ్‌ని 2 గంటల 38 నిమిషాలుగా లాక్ చేశారట. ఈ సినిమాకు మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తుండగా అందాల భామ భాగ్యశ్రీ బొర్సె హీరోయిన్‌గా నటిస్తోంది. విలక్షణ నటుడు జగపతి బాబు ఈ సినిమాలో విలన్‌గా నటిస్తున్నాడు. ఆగస్టు 15న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అయ్యింది.



SPORTSNEWS ఆట పదం



## శభాష్.. ఇవాన్..

### ఇది కదా.. ఆట నీతి..

**కెన్యా ప్రత్యర్థిని గెలుపు తీరం చేర్చిన త్యాగశీలి.. స్పానిష్ క్రీడాకారుడిపై ప్రశంసల వెల్లువా..**




**సమాజంలో నైతికత పతనం అవుతున్న నేపథ్యంలో ఈ సన్నివేశం మనుషుల్లో ఇంకా ఏదో మూలన దాగి ఉన్న నైతికతను మేల్కొలిపేదిగా అనిపించింది. స్పానిష్ క్రీడాకారుడు ప్రదర్శించిన క్రీడాస్ఫూర్తిని యావత్ క్రీడాలోకం వేనోళ్ల కీర్తించింది.**

**జనపదం, స్పోర్ట్స్:** ఇది కదా గెలుపంటే. ఇదే కదా ఆట నీతంటే. వెనకబడి ఉన్నామని తెలిసి, ముందున్న ఆటగాడికి సంపూర్ణంగా గెలిచే అవకాశం కల్పించిన తీరు అత్యద్భుతం. అతడు వెనకబడితే తర్వాత ఉన్న తనే విజేత అని తెలిసినా ఆట విలువను కాపాడుతూ నిజమైన విజేతగా నిలిచిన తీరు అమోఘం. అక్కడ గెలిస్తే కేవలం మైదానం వరకే ప్రశంసలు దక్కునేమోగానీ, నిజమైన విజేతను గెలిపించి తానోడినా సమస్త జనాల పొగడ్తలను మాత్రం గెలుచుకున్నారు. స్పానిష్ ఆటగాడి నైతికత ఒలింపిక్స్ లో ఒక మైలురాయిగా మిగిలిపోనున్నది. వివరాలివి.. కెన్యా ఆటగాడు రన్నింగ్ రేసులో ముందున్నాడు. గెలుస్తున్నాడు. ముందు గీతను చూసి రేసు చరమ గీత అనుకుని ఆగిపోయాడు. భాష రాదు. కాబట్టి అదే విన్నింగ్ రేఖ అనుకుని ఆగిపోయాడు. కానీ వెనకాలే పరుగెడుతున్న స్పానిష్ రన్నర్ కెన్యా రన్నర్ ను " ఇంకా పరుగెత్తాలి " అంటూ కెన్యా ఆటగాడిని ముందుకు తోసి ఆ రేస్ కెన్యా ఆటగాడే గెలిచేలా చేశాడు.

**తరువాత ఓ జర్నలిస్టు స్పానిష్ ఆటగాడి మధ్య జరిగిన సంభాషణ మానవునిలోని దైవాన్ని చూపుతుంది.**

**జర్నలిస్టు : 'మీరు అలా ఎందుకు చేశారు'**

**ఇవాన్ ఫెర్నాండెజ్ (స్పానిష్ క్రీడాకారుడు) : 'ఏదో ఒకరోజు మనం ఒకళ్ళకి ఒకళ్ళు సహాయం చేసుకుంటూ అందరం గెలిచే సమాజం కోసం అలా చేశాను.'**

**మీరు ఆ కెన్యా రన్నర్ ముటాకు మీకు రావలసిన బంగారు పతకం ధార పోశారు తెలుసా..?**

**ఇవాన్ : నేనేం అతడికి సాయం చేయలేదు. ఈ రేసు అతను గెలవబోతున్నాడు. కేవలం భాష రాకపోవటంతో ఆయన ఆగాడు.**

**కానీ మీరు గెలిచేవారే కదా..?**

**ఇవాన్ : అవును. బంగారు పతకం గెలిచేవాడినే. కానీ ఆ బంగారు పతకానికి అప్పుడు ఏమి విలువ ఉంటుంది.**

(అయినా జర్నలిస్టు పదేపదే ఇవాన్ ను ప్రశ్నిస్తూనే ఉన్నారు.. బంగారు పతకం గెలిచేవారేకదా అని అడుగుతూనే ఉన్నాడు.)

**జ : మీరు బంగారు పతకాన్ని గెలిచేవారే కదా ?**

**ఇవాన్ : ఆ గెలుపుకు విలువేమున్నది ? నా తల్లి నా గురించి ఏమనుకుంటుంది ? మానవీయ విలువలు ఒక తరం నుంచి మరో తరానికి పెరుగుతూ అందింపబడాలి. మన పిల్లలకు మనం అదే నేర్పాలి. మన పిల్లలకు మనం సరైన మార్గంలో వెళ్లడం నేర్పించాలి. తప్పుడు మార్గంలో వెళ్లి గెలవడం పిల్లలకు నేర్పకూడదు. అలా కాకుండా మానవీయ విలువలు పెంచుతూ ఒకరి కొకరం సహాయ పడుతూ పురోగమించాలని చెప్పాలి. ఎందుకంటే నిజాయితీ, నైతిక విలువలే ఎప్పుడూ విజయం సాధిస్తాయి.**



## వినేశ్‌కు సిల్వర్ మెడల్‌దక్కేనా..?

**గేమ్స్ అయ్యేలోగా నిర్ణయం వెల్లడిస్తాం..**

**వినేశ్ ఫొగాట్ అభ్యర్థనపై కాస్**

**జనపదం, స్పోర్ట్స్:** పారిస్ ఒలింపిక్ లో భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ కు పతకం ఖాయం అనుకుంటున్న తరుణంలో దేశాన్ని షాక్ గురి చేసే ఘటన జరిగింది. ఆమె 50 కేజీల విభాగంలో 100 గ్రాముల అధిక బరువు కారణంగా ఫొగాట్‌పై అనర్హత వేటు పడింది. ఈ నేపథ్యంలో తనపై అనర్హతను వినేశ్ ఫొగాట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్‌లో సవాల్ చేసింది. వినేశ్ అభ్యర్థనను కాస్ తాజాగా విచారణకు స్వీకరించింది. ఒలింపిక్ గేమ్స్ ముగిసేలోగా నిర్ణయం వెల్లడిస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు కాస్ అధికారిక ప్రకటన చేసింది. కాగా, అదనపు బరువు కారణంగా అనర్హతకు గురైన వినేశ్ ఫొగాట్ తనకు రజత పతకం ఇవ్వాలని అప్పీలులో కోరింది. అయితే, ఒలింపిక్స్‌లో నిబంధనలను మార్చే అవకాశం లేదని యునైటెడ్ ప్రపంచ రెజ్లింగ్ స్పష్టం చేసింది. ఒకవేళ ఆర్బిట్రేషన్ అనుమతి ఇస్తే వినేశ్‌కు సిల్వర్ మెడల్‌దక్కే ఛాన్స్ ఉంది. దీంతో కాస్ ఏ తీర్పు ఇస్తుందా అని భారత్ వేచి చూస్తోంది.

## వందశాతం కష్టపడ్డా..

- భవిష్యత్ లో మరింత శ్రమిస్తా..
- గోల్డ్ మెడల్ సాధిస్తా..
- జావెలిన్ త్రో ప్లేయర్ నీరజ్ చోప్రా..

జనపదం, స్పోర్ట్స్: పారిస్ ఒలింపిక్స్ లో బంగారు కొండగా నిలుస్తాడను కున్న నీరజ్ చోప్రా సిల్వర్ మెడల్ తో సరిపెట్టాడు. అయితే ఒలిపింక్స్ లో భారత్ కు ఇది తొలిస్వర్ణం కావడం గమనార్హం. గురువారం రాత్రి జరిగిన జావెలిన్ త్రో ఈవెంట్ ఫైనల్‌లో నీరజ్ చోప్రా కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ తుది పోరులో పాకిస్తాన్ జావెలిన్ త్రో ప్లేయర్ అర్షద్ నదీమ్ 92 మీటర్లతో స్వర్ణం సాధించగా, నీరజ్ 89.45 మీటర్లతో సిల్వర్‌ను సొంతం చేసుకున్నాడు. నీరజ్‌పై దేశవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది. ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి అభినందనలు తెలిపారు.



**బాధగా ఉంది.. సమీక్షించుకుంటా..**

తాజాగా నీరజ్ చోప్రా తన ప్రదర్శనపై స్పందించాడు. తన ఆటను సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. దేశానికి మెడల్ అందించినందుకు ఆనందంగానే ఉందని, కానీ నా ప్రదర్శనను ఇంకాస్త మెరుగు పర్చుకోవాలన్నారు. కచ్చితంగా దీనిపై సమీక్షించుకుంటానని పేర్కొన్నాడు. జావెలిన్ త్రో గట్టి పోటీ ఉందని, ప్రతి అథ్లెట్ కూడా తనదైన రోజున అదరగొడతాడని, ప్రస్తుతం ఇది అర్షద్ డే అని చెప్పుకొచ్చారు. అయితే తాను కూడా వంద శాతం కష్టపడ్డానని, కానీ మరికొన్ని అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం కచ్చితంగా ఉందని పేర్కొన్నారు. మన జాతీయ గీతం వినిపించ లేకపోయినందుకు ఎంతో బాధగా ఉందని, కచ్చితంగా భవిష్యత్తులో సాధిస్తానని అని నీరజ్ స్పష్టం చేశాడు.



## పతాకధారులుగా శ్రీజేష్, మనూ భాకర్

**ప్రకటించిన భారత ఒలింపిక్ సంఘం**

**జనపదం, స్పోర్ట్స్:** పారిస్ ఒలింపిక్స్‌లో పతాకధారుల పేర్లను భారత ఒలింపిక్ సంఘం ప్రకటించింది. మెగా క్రీడల్లో రెండు కాంస్య పతకాలు గెలిచిన షూటర్ మనూ భాకర్ పేరును ఇప్పటికే ప్రకటించారు. అయితే ముగింపు వేడుకల్లో భారత జాతీయ జెండాను ఆవిష్కరించే అవకాశాన్ని హాకీ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్‌కు కూడా కల్పించారు. పతాకధారులుగా పీఆర్ శ్రీజేష్, మనూ భాకర్ ఉండనున్నట్లు ఐఓఏ శుక్రవారం ప్రకటించింది. శ్రీజేష్ అంశంలో ఐఓఏ సభ్యులు భావోద్వేగపూరిత నిర్ణయాన్ని తీసుకున్నట్లు ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష తెలిపారు. హాకీలో ఇండియా బ్రాంజ్ మెడల్ గెలిచింది. అయితే చివరి మ్యాచ్ తర్వాత శ్రీజేష్.. హాకీకి రిటైర్మెంట్ ప్రకటించారు.

## వినేశ్.. రజతానికి అర్హురాలే..

### లెజెండరీ క్రికెటర్ సచిన్..

జనపదం, స్పోర్ట్స్: భారత్ రెజ్లర్ వినేశ్ ఫోగట్‌కు లెజెండరీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ మద్దతు తెలిపాడు. దీనికి సంబంధించి శుక్రవారం సచిన్ ట్విట్టర్‌లో ఓ ట్వీట్ చేశారు. దీనికి 'టైమ్ ఫర్ అంపైర్స్ కాల్' అనే టైటిల్ పెట్టాడు. వినేశ్ రజత పతకానికి అర్హురాలని సచిన్ అభిప్రాయపడ్డాడు. 'ప్రతి క్రీడకు నియమాలు ఉంటాయి. ఆ నియమాలను సందర్భానుసారంగా చూడాల్సి ఉంటుంది. కొన్నిసార్లు మళ్లీ పరిశీలించాల్సి వస్తుంది. వినేశ్ ఫోగాట్ ఫైనల్స్‌కు ఫెయిర్ అండ్ స్క్వేర్‌గా అర్హత సాధించింది. ఆమె అధిక బరువుతో డిస్క్వాలిఫై అయింది ఫైనల్స్‌కి ముందు మాత్రమే. కానీ ఆమె సిల్వర్ మెడల్‌ని లాక్కోవడంలో లాజిక్, స్పోర్టింగ్ సెన్స్ లేవు' అంటూ సచిన్ ట్వీట్‌లో పేర్కొన్నాడు. పెర్ఫార్మెన్స్ మెరుగు పర్చుకునేందుకు డ్రగ్స్ ఉపయోగిస్తే అనర్హత వేటు వేయడంలో అర్థం ఉందని సచిన్ పేర్కొన్నాడు. అయితే వినేశ్ చాలా చక్కటి ప్రదర్శనతో ఫైనల్స్‌కు చేరుకుందని, ఆమె సిల్వర్ మెడల్‌కి అర్హురాలని సచిన్ అభిప్రాయపడ్డాడు.

**ట్వీట్‌కి భారీ రెస్పాన్స్**

సచిన్ ట్వీట్‌కి కొన్ని నిమిషాల్లోనే సోషల్ మీడియా యూజర్ల నుంచి భారీ స్పందన లభించింది. ఈ ట్వీట్‌ని కేవలం 1.30 గంటల్లో 4.34 లక్షల మందికిపైగా చూశారు. 26 వేల మందికిపైగా లైక్ చేశారు. చాలా మంది నెటిజన్లు సచిన్ వాదనను సమర్థిస్తూ కామెంట్లు చేస్తున్నారు.

